నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఉస్మానియా ఆసుపత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, ఉస్మానియా దంత వైద్య కళాశాల తదితర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

'జీవన్‌దాన్‌తో ఇతరుల ప్రాణాలను రక్షించవచ్చు'

సుల్తాన్‌బజార్: జీవన్‌దాన్‌తో ఇతరుల ప్రాణాలను రక్షించవచ్చని జీవన్‌దాన్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భూషణ్ రాజు అన్నారు. శనివారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో జీవన్‌ధాన్ కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్లకు 5వ బ్యాచ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఐదు బ్యాచ్‌లలో 300లకు పైగా ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్లకు శిక్షణను ఇచ్చారు. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని జీవన్‌దాన్ ఆవశ్యకతపై, కాలేయ మార్పిడి ఆచరణాత్మక విషయాలపై శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నెఫ్రాలజిస్ట్ హెచ్‌ఓడీ డాక్టర్ మనీషా సహాయ్, గ్యాస్ట్రో ఎంటమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ పి.లక్ష్మి విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


పనులను పరిశీలిస్తున్న డీజీఎం చంద్రు

గౌలిపురా: రానున్న ఎండా కాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అలియాబాద్ సబ్ డివిజన్ డీజీఎం చంద్రు అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని ఛత్రినాక నుంచి లాల్‌దర్వాజా దారిలో చేపడుతున్న తాగునీటి పైప్ లైన్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రు మాట్లాడుతూ..ప్రజలకు ఎండా కాలం సందర్భంగా నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు రవి తదితరులు ఉన్నారు.

త్వరలో నిర్వహించే వార్డు సభలో రేషన్ కార్డుల పంపిణీ


సురేందర్

యాకుత్‌పురా: త్వరలో నిర్వహించే వార్డు సభలో రేషన్ కార్డుల పంపిణీతో పాటు నూతన దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పౌర సరఫరాల శాఖ యాకుత్‌పురా సర్కిల్-02 ఏసీఎస్‌ఓ మోకా సురేందర్ తెలిపారు. పురానీహవేలీలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో తమ సర్కిల్ పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 7935 దరఖాస్తులు అందాయన్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో తమ శాఖతో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బందితో గత నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టామన్నారు. సర్వేలో 6816 మంది దరఖాస్తులను అర్హులుగా గుర్తించామన్నారు. ప్రజలు నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం ఆందోళనకు గురి కాకుండా ప్రభుత్వం నుంచి అనుమతి ఇవ్వగానే చేసుకోవాలన్నారు.

'ఉస్మానియా'లో మృత శిశువు కలకలం

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆసుపత్రిలో మృత శిశువు కలకలం రేపింది. సుమారు ఒక రోజు వయసు ఉన్న మృత శిశువును శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, అంబులెన్స్ పార్కింగ్ ప్రాంతంలో వదిలి వెళ్లారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృత శిశువును మార్చురీకి తరలించారు. శిశువును ఎవరు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు అనే కోణంలో విచారణ చేపట్టారు. ఆసుపత్రిలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

చోరీకి వచ్చి చిక్కాడు

చాంద్రాయణగుట్ట: ఓ ఇంట్లో దొంగతనం చేసేందుకు యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కుమ్మర్‌వాడీ బస్తీకి చెందిన ఓ ఇంట్లోకి ప్రహరీ పైనుంచి శనివారం తెల్లవారుజామున ఓ యువకుడు దూకి దొంగతనానికి యత్నించాడు. అలికిడి వచ్చి నిద్రలేచిన కుటుంబ సభ్యులు స్థానిక యువకుడు సాయి సాయంతో పోలీసులకు అప్పగించారు. నాలుగైదు రోజుల నుంచి సదరు యువకుడు స్థానికంగా అనుమానాస్పదంగా తచ్చాడాడని స్థానికులు తెలిపారు. యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడో..?

- అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు
- ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


ఫతే దర్వాజాలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు

దూద్‌బౌలి: ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని వాహనదారులతో పాటు విద్యార్థులు, పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వరకు నిర్వహించే రోడ్డు విస్తరణ పనులకు సగం పూర్తి చేసి వదిలేశారు. దీంతో భవన యజమానుదారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వరకు 172 కట్టడాలు రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేయాల్సి ఉండగా..ఇందులో గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సగం మంది భవన యజమానుదారులు అధికారులకు రోడ్డు విస్తరణకు సహకరించి వారి ఇంటి దస్తావేజులు సమర్పించగా వారికి నష్ట పరిహారం కింద డబ్బులు చెల్లించి సగం వరకు రోడ్డు విస్తరణలో భవనాలను కూల్చివేశారు.

నిరాశకు గురైన స్థానికులు..

ఇప్పటికే రోడ్డు విస్తరణకు సహకరించిన భవన యజమానులకు నష్టపరిహారం కింద చెక్కులు అందించకపోవడంతో నిరాశతో ఉన్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులను ప్రశ్నించగా జీహెచ్‌ఎంసీలో డబ్బులు లేవని సమాధానం ఇస్తున్నారని భవన యజమానులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన భవన యజమానులు మాత్రం మేము రోడ్డు విస్తరణకు మా భవనాలను ముందుగా ఎందుకు ఇచ్చామని బాధపడుతున్నారు. ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రతి నిత్యం ప్రయాణికులు ప్రజలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు లేకపోవడమా..ప్రభుత్వం మారడమా..?

నిధులు లేకపోవడమో లేక ప్రభుత్వం మారడమో కానీ 2023లో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు ముందుకుసాగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసి రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ వెంటనే ప్రారంభించాలి



ఫతే దర్వాజా నుంచి హుస్సేనీ ఆలం వరకు ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు కొన్ని భవనాలను కూల్చివేసి మిగతా వాటిని అలాగే వదిలేసి చేతులు దులుపుకున్నారు. నా ఇల్లు సైతం రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేయాల్సి ఉండగా చెక్కు ఇచ్చి..మళ్లీ తీసుకున్నారు. నా ఇల్లుకు సంబంధించి పూర్తి దస్తావేజులు సమర్పించా. వెంటనే రోడ్డు విస్తరణ పనులను ప్రభుత్వం ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. – ప్రమోద్ కుమార్ జైన్, సిప్లిగంజ్

పనులు తిరిగి ప్రారంభించాలి



దశాబ్దాలుగా రోడ్డు విస్తరణకు నోచుకోని హుస్సేనీ ఆలం ఫతే దర్వాజా వరకు రోడ్డు విస్తరణ పనులను ఆగమేఘాల మీద ప్రారంభించిన మున్సిపల్ అధికారులు కొన్ని భవనాలను కూల్చివేసి మిగతా భవనాలు అలాగే వదిలేశారు. దీంతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసి తిరిగి పనులను ప్రారంభించాలి. – హబీబ్ ఖురేషి, జాతీయ జమాతుల ఖురేషి సంస్థ ప్రధాన కార్యదర్శి

'రాష్ట్రంలో ప్రజా కంటక పాలన కొనసాగుతోంది'


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: రాష్ట్రంలో 13 నెలలుగా ప్రజా కంటక పాలన కొనసాగుతోందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. గౌలిగూడలోని తన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రజా పాలన అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం పాటించడం లేదన్నారు. గోషామహల్ పోలీస్‌స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రజా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చాక్నావాడి నాలా కుంగిపోయిన ఘటనపై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విన్నవించి నాలుగు గంటలోనే మళ్లీ చాక్నావాడికి నాలా కృంగి పోయిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అహ్మద్, భజన్‌సింగ్, మహేష్ గౌడ్, నరేష్ గౌడ్, జై అజ్జు పాల్గొన్నారు.

లక్ష డప్పులు..వెయ్యి గొంతులు కార్యక్రమానికి మద్దతు


మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ వర్గీకరణ అమలుకు ఈ నెల 7న నిర్వహిస్తున్న లక్ష డప్పులు..వెయ్యి గొంతులు కార్యక్రమానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు అరుందతియా బంధు సేవా మండలి ప్రకటించింది. మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవేర్చడానికి నిర్వహిస్తున్న సాంస్కృతిక ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సేవా మండలి గ్రేటర్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలుపై మాదిగలకు ఇచ్చి న హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. లక్షల డప్పులు..వెయ్యి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. ఈ సమా వేశంలో సేవా మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీబీ సత్యేంద్ర కృష్ణ, ఉపాధ్యక్షుడు ఈశ్వర్, నగర ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నిరంతరం నూతనత్వమే నా అన్వేషణ


మాట్లాడుతున్న ఏటూకూరి ప్రసాద్

గన్‌ఫౌండ్రీ: సాహిత్య సృజన, పరిశోధన, బోధన ఇలా ఏ రంగంలోనైనా నూతనత్వం కోసం అన్వేషించడమే ఎనిమిది దశాబ్దాలుగా తన కృషికి ప్రేరణ అని కవి డాక్టర్ ఏటూకూరి ప్రసాద్ తెలిపారు. శనివారం రవీంద్రభారతిలో కేంద్ర సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విమర్శకుడితో ఒక సాయంత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాల్యంలో భక్తిగీతాలు పాడుతూ ప్రభాతభేరి కార్యక్రమాలలో తిరిగిన తాను క్రమంగా పీడిత ప్రజల విముక్తి కోసం పాటలు రాయడానికి కలిగిన కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి, విప్లవ కవి నిఖిలేశ్వర్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న ఏసీపీ మహ్మద్ గౌస్

సంతోష్‌నగర్: సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. ఐ.ఎస్.సదన్ వినయ్‌నగర్ కాలనీలోని సాన్వి కళాశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ..అత్యాధునిక సైబర్ నేరాలైన కొరియర్ మోసం, ట్రేడింగ్ మోసం, నకిలీ ఆన్‌లైన్ గిఫ్ట్ ఆఫర్, ఆన్‌లైన్ నకిలీ ప్రకటనలు తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలపై నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైదాబాద్ అదనపు ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కుమార్, ఎస్సైలు రుమాన, బ్రహ్మచారి, సాన్వి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జాయిస్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కంచన్‌బాగ్ పోలీసుల ఆధ్వర్యంలో మిధాని డిపోలో ప్రయాణికులకు సైబర్ నేరాలపై నాటక ప్రదర్శన నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంచన్‌బాగ్ ఎస్సై జి.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో 'ఎ డే విత్ హెచ్‌ఆర్ లీడర్'



గోల్కొండ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనలెటిక్స్‌కు హెచ్‌ఆర్ అనుగుణంగా ఉండాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్ పర్సన్, స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చైర్ పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌వో ఐఎం రామ్‌డేవో 2025 'ఎ డే విత్ హెచ్‌ఆర్ లీడర్' కార్యక్రమం జరిగింది. విద్యా సంస్థలు పరిశ్రమలను అనుసాధించే లక్ష్యంతో జరిగిన ఈ హెచ్ ఆర్ సమిట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానవ వనరులలో కీలకమైన ధోరణిలు, సవాళ్లను చర్చించే ఇటువంటి సమావేశాలు ఎంతో కీలకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో విప్రోకు చెందిన ప్రియాంక రాయ్, ఏటోరో ల్యాబ్‌కు చెందిన ప్రతినిధి జైపాల్‌రెడ్డి, ఈవోలిస్‌కు చెందిన డాక్టర్ రీనా దాస్, డెలైట్ ప్రతినిధి ప్రేమ్‌కుమార్‌తో పాటు మాడరేటర్లు సుమన, ప్రవీణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం


పట్టాలు పొందిన విద్యార్థినులు

గోల్కొండ: తాము కనే కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడి చదవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం మెహిదీపట్నంలోని సెంటాన్స్ మహిళా కళాశాల 6వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో కళాశాల జీవితం ఎంతో విశిష్టమైందన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులకు తమ భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ కె.శశికాంత్‌తో కలిసి చదువు పూర్తి చేసుకున్న వారికి పట్టాలు అందజేశారు. అంతకు ముందు కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సిస్టర్ ఆంథోనమ్మ సుపీరియర్ జనరల్, రెవరెండ్ సిస్టర్ ఆన్‌రోజ్ ప్రావెన్షియల్ సుపీరియర్, సిస్టర్ మారియారాణి, డాక్టర్ సిస్టర్ అల్లం విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి


వాటర్ బోర్డు ఎండీని కలిసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానం ద్వారా వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డు పాలయ్యారన్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని శనివారం ఆయన కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఏఎంఎస్ విధానం ద్వారా ఎంతో మంది కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారన్నారు. గతంలో ఉన్న ఓపెన్ టెండర్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులను కలిసి ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని మెమోరాండం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాటర్‌బోర్డు ఎండీ సానుకూలంగా స్పందించి వెంటనే విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వార్షికోత్సవం



నాంపల్లి: డామ్నిక్స్ విద్యా సంస్థల వార్షికోత్సవాన్ని శనివారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా నిర్వహించారు. అద్వితీయ భారత్ (ఒక దేశం-చాలా కథలు) అంటూ విద్యార్థులు అనేక రకాల ప్రదర్శనలు చేశారు. సందీప్ ఉన్ని కృష్ణన్‌కు నివాళులర్పిస్తూ చేసిన ప్రదర్శన సభలోని అందరి చేత కంట తడిపెట్టించింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ జి.సి.కవిత హాజరై చక్కటి ప్రదర్శనలు చేసిన చిన్నారులను అభినందించారు. కరస్పాండెంట్ అంకితారెడ్డి, కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తే అనుకున్న లక్ష్యం సాధ్యం

చార్మినార్: కష్టపడి పని చేస్తే అనుకున్న లక్ష్యం సాధ్యమవుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సుల్తాన్‌బజార్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ నితిన్ శ్రీహరి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ కెరీర్ గైడెన్స్ సెల్, తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ సంయుక్తాధ్వర్యంలో శనివారం బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని కృషి చేస్తే సాధించలేనిదేమీ లేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా మాట్లాడుతూ..భిన్నమైన పనులు చేయడానికి ప్రయత్నించకుండా, పనులను భిన్నంగా చేయగలిగితేనే జీవితంలో నిజమైన విజయాన్ని సాధించవచ్చు అన్నారు. బ్యాంక్, రైల్వే, కేంద్ర ప్రభుత్వ తదితర రంగాల్లోని ఉద్యోగాల కోసం నిర్వహించే ఉచిత శిక్షణను విద్యార్థులు పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ భాస్కర్ సమన్వయం వహించగా, స్టడీ సర్కిల్ బాధ్యులు బాలకృష్ణ, డాక్టర్ నీరజ, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ ఝాన్సీ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డుకు ముగ్గురి ఎంపిక

అఫ్జల్‌గంజ్: 25 ఏళ్లగా కేన్సర్ రహిత సమాజ స్థాపనకు పాటుపడుతున్న ప్రొఫెసర్ గీతానాగశ్రీ, ప్రొఫెసర్ బి.ఉమాకాంత్ గౌడ్, ప్రొఫెసర్ జోసెఫ్ బెంజిమెన్‌కు ప్రపంచ కేన్సర్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా 'బెస్ట్ ఆంకాలజిస్ట్ అవార్డు-2025'కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, సెక్రెటరీ జనరల్ డాక్టర్ కెపి.హేమంత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అఫ్జల్‌గంజ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నుంచి ముగ్గురు ప్రొఫెసర్లను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలోని దర్బార్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ప్రముఖ విద్యావేత్త, జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సభ్యులు లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నాంపల్లిలో నకిలీ కరెన్సీ పట్టివేత


నకిలీ కరెన్సీతో నిందితుడు మురళీకృష్ణ

నాంపల్లి: నకిలీ కరెన్సీని ముద్రించి మార్కెట్‌లో చలామణి చేయడానికి నగరానికి చేరుకున్న ఓ నేరస్తుడిని మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాంపల్లి శాంతిభద్రతల పోలీసులతో కలిసి పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న పార్శిల్ బాక్స్‌లోని రూ.11,10,500 నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..గుంటూరుకు చెందిన మురళీకృష్ణ (38). ఖమ్మం జిల్లా నాయుడు పేటలో నివాసం ఉంటున్నారు. తనకు ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించి మార్కెట్‌లో చలామణి చేసి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచన చేశారు. మెట్రో సిటీలను లక్ష్యంగా చేసుకున్నాడు. నకిలీ నోట్లతో శనివారం ఖమ్మం నుంచి నగరానికి వచ్చాడు. నగరంలో అడుగుపెట్టగానే పోలీసులకు విశ్వాసనీయ సమాచారం వచ్చింది. అతడిని నాంపల్లి బజార్‌ఘాట్‌లో పట్టుకుని నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై 2018 నుంచి పాత నేర చరిత్ర ఉంది. ఏపీలోని కావలి పోలీస్‌స్టేషన్, తెలంగాణలోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్లలో మూడు కేసులు నమోదై ఉన్నాయి. నకిలీ నోట్ల కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చాడు. మళ్లీ నకిలీ నోట్లను ముద్రించే ప్రక్రియను ప్రారంభించాడు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాలు దగ్ధం



చాంద్రాయణగుట్ట: పోలీస్‌స్టేషన్ ఆవరణలో పార్కు చేసి ఉన్న క్రైం డిపాజిట్ వాహనాలు అగ్నికి ఆహుతైన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ ఆవరణలో నేరాలలో ప్రమేయమున్న, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వాహనాలను ఎప్పటి నుంచో పోలీసులు పార్కు చేసి ఉంచారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలంటుకొని మూడు ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలకు వ్యాపించాయి. ఇది గమనించిన పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో ఫైరింజన్‌తో మంటలార్పారు. ఎవరైనా సిగరేట్ తాగి పడేస్తే మంటలంటుకున్నాయా.? మరే ఇతర కారణాలున్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


(నాడు)


(నేడు)

గోల్కొండ: 'వంద శాతం వ్యర్థాలమయం' అనే శీర్షికతో గత వారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. శనివారం డీఆర్‌ఎఫ్ సిబ్బందిని శాతం చెరువు వద్దకు పంపి చెరువు కట్టపై ఉన్న గుర్రం కళేబరాన్ని, వ్యర్థాలను తొలగించారు. చెరువులో, చెరువు కట్టపై ఎవరు వ్యర్థాలు తెచ్చి వేయకుండా అడ్డుకునేందుకు బల్దియా వారు ముగ్గురు సెక్యూరిటీ గార్డులను ఇక్కడ నియమించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసని 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

గోల్కొండ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ వర్గాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. సామాన్యులకు ఆదాయ పన్ను పరిమితి పెంచడంపై ఉద్యోగులు చిన్న వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. పరిమితి ఇంకా పెంచితే బాగుండేదని మరికొందరు అంటున్నారు. బడుగు జీవికి ఆశాకిరణం లాంటిది బడ్జెట్‌లో ఏమి లేదని బీజేపీని వ్యతిరేకించే వారు అంటుండగా ఇదే అత్యుత్తమ బడ్జెట్ అని ఎక్కువ మంది అభిప్రాయ పడుతున్నారు.

ఇదే అత్యుత్తమ బడ్జెట్



ప్రధాని మోదీ సారథ్యంలో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యుత్తమమైనది. ఆర్థిక రంగంలో తాము గొప్పవారమని చెప్పుకునే వారికి ఈ బడ్జెట్ కనువిప్పు. ముఖ్యంగా ఆదాయపు పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ స్పష్టమవుతోంది. – దేవర శ్రీనివాస్, బీజేపీ నాయకుడు

రైతులు, మహిళలకు మొండి చేయి



రైతులకు ఈ బడ్జెట్ వల్ల ఒరిగేంది లేదు. దేశ జనాభాలో సింహ భాగమైన మహిళలకు కూడా బడ్జెట్ వల్ల సమకూరే ప్రయోజనం అతి తక్కువ. తమకు కొమ్ముకాచే వారికే బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా ఎన్నో వెసులుబాటు కల్పించింది. – కురాకుల కృష్ణ, కార్వాన్

అన్ని రంగాల వారికి ఆమోదయోగ్యంగా ఉంది



విద్య, వైద్యం, వ్యవసాయం పారిశ్రామిక రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. పేద, మధ్య తరగతి అభ్యున్నతికి ఈ బడ్జెట్ దోహదపడుతుంది. ఇన్‌కం ట్యాక్స్‌లో, స్లాబ్‌లలో మార్పులతో ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంది. మొత్తంగా బడ్జెట్ ఫుల్‌మీల్స్ పెట్టినట్లు ఉంది. బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పించడంపై రైతులకు ఒక భరోసా వచ్చింది. ఎట్టకేలకు ఈ బడ్జెట్ అన్ని రంగాల వారికి ఆమోదయోగ్యంగా ఉంది. – రాకేష్ జైస్వాల్, జాంబాగ్ కార్పొరేటర్